# దైవసన్నిధియందు మాత్రమే వైరాగ్యము లభిస్తుంది

దంతములకు మధ్య ఎంతో నేర్పుగలిగి
నాల్క తిరుగుచుండు నలిగిపోక
నరుడుకూడ అటులె నడచుట మేలయా
మరువబోకుడిటువంటి మంచిమాట.

శంకరులవారు మానవ జీవితమును గురించి వర్ణిస్తూ మానవుడు ఈ జీవిత నాటకరంగమునందు నటించి, సుఖించి, దుఃఖించి, మరణించి మాయమవుతున్నాడని వ్యాఖ్యానించారు.

తామరాకుపై తళతళలాడే
నీటిబొట్టువలె నిలకడ లేనిది
బ్రతుకభిమానపు తెగులు పుట్టరా
దిగులు, దుఃఖముల తెరరా లోకము

**ఎక్కడ వైరాగ్యమో అక్కడ నిర్భయము**

మానవజీవితము అనేక విధములైన అభిమానములతోకూడిన ఒక యిల్లు. అన్నీ విచారములే, అన్నియు నిరాశలే! అన్నీ నిస్పృహలే! నిస్సందేహము అనేది కన్పించటంలేదు. క్షణక్షణము సందేహములతోకూడినదే మానవ శరీరము, క్షణక్షణము దిగులుతో చేరినదే ఈ మానవశరీరము. దీనికి ఎక్కడ అభయమున్నది? ఎక్కడకు పోయినా భయం, భయం.

భయం భయం బ్రతుకు భయం అన్నా
మనకీలోకం పన్నిన పద్మవ్యూహం

sri sathyasai vachanamrutam

**గతిలేని మానవులకు చితికిన సంసారములకు**
**కష్టాలే బంధువులా! కన్నీళ్లే కానుకలా!**
**భయం భయం బ్రతుకు భయం.**

ఇట్టి భయములతో, యిట్టి అభిమానములతో, యిట్టి ఆవేశములతో, యిట్టి అహంకారములతోకూడిన యీ మానవత్వములో చిక్కేటువంటి సుఖము ఏమిటి? ఒకవేళ చిక్కినా అదికూడా భయముతోకూడిన ఆనందమే! నిర్భయము అనేది జీవితములో ఎక్కడా కనుపించటంలేదు. ఎక్కడ నిర్భయము? ఎక్కడ వైరాగ్యమో అక్కడ నిర్భయము. ఆ వైరాగ్యము మనకు ఎక్కడ లభ్యమవుతుంది? దైవ సన్నిధియందు మాత్రమే వైరాగ్యము లభ్యమవుతుంది. కనుక 'మానవులారా! మీరు ఈ భయమును దూరము గావించుకొని అభయత్వమును పొందే నిమిత్తమై ఆత్మ సన్నిధి చేరండి' అని ప్రబోధిస్తూ వచ్చాడు శంకరుడు. అక్కడికి వెళ్లినప్పుడే ఈ భయమనే యదార్థము మనకు చక్కగా అర్థమవుతుంది.

## ప్రత్యక్ష, పరోక్ష, అనుమానములు మూడింటికి మూలస్థానము ఒకటే!

సుఖము దుఃఖము, పాపము పుణ్యము, లాభము నష్టము, చీకటి వెలుగు యివన్నీ ఒకదానికొకటి ఆభావములే! యివి ప్రత్యేకము, వేరు వేరు కాదు. దీనికి మూలాధారము ఒక్కటే, అదే ఆత్మ. అట్టి ఆత్మను ఆధారము చేసుకునే అనేకమైనవి ఉద్భవిస్తూవస్తున్నాయి. ఇది ఒక పుష్పము. దీనిలో ఎన్నో రేకలుంటున్నాయి. ఈ రేకలు వేరువేరుగా కనిపిస్తున్నాయి. కానీ అన్ని రేకులు ఒకే స్థానమునుండి పుడుతూ వచ్చాయి. ఇదియే ఆత్మస్థానము. ఈ ఆత్మస్థానమునుండియే అన్ని రేకలు ఉద్భవిస్తూ వస్తున్నాయి. కానీ వీటన్నిటిని కలిపి మనం ఒకే పుష్పముగా విశ్వసిస్తున్నాము. పుష్పము ఒక్కటే, రేకలు భిన్నము. ఈ రేకలు అన్నింటికి స్థానము ఒక్కటే! అనంతమైన సాగరమునందు అసంఖ్యాకమైన అలలు బయలుదేరుతున్నాయి. అయితే ఒక అలవలె మరొక అల ఉండటంలేదు. ఒక అలవలె మరొక అల కనిపించటంలేదు. అలలు అనేకంగా



sri sathyasai vachanamrutam

ఉంటున్నాయి. ఎక్కడనుండి వస్తున్నాయి? వీటికి మూలాధారము ఏమిటి? అదే సముద్రము. సముద్రము ఒక్కటే! అలలు భిన్నంగా కనిపిస్తున్నాయి రూపనామములు భిన్నంగా కనిపిస్తున్నాయి. రూపనామములు భిన్నముగా కనిపించినప్పటికి సముద్రములో ఏ రుచి, ఏ చల్లదనము, ఏ తడి ఉన్నవో ఈ అలలయందు ఆ గుణములే ఉంటున్నవి. ఏ అలలలో చూచినా తడి ఉంటున్నాది, చల్లదనము ఉంటున్నాది, తెల్లదనముంటున్నాది. సముద్రములోకూడా అవే ఉంటున్నాయి. సముద్రము చుక్క నోటిలో వేసుకుంటే అది ఉప్పగా ఉంటున్నది. అలలోని నీటిబిందువు నోటిలో వేసుకుంటే అదికూడా ఉప్పగానే ఉంటున్నాది. అయితే ఈ అలలనుంచి నురుగు ఆవిర్భవించింది. నురుగుకు ఆధారం ఏమిటి? దీనికి అలలే ఆధారము. అలలకు ఆధారము ఏమిటి? సముద్రమే ఆధారము. ఈ మూడింటికి ఆధారము ఏమిటి? ఆ సముద్రమే ఆధారము. సముద్రమునందున్న జలమే అలలుగా బయలుదేరి అలలోనున్నటి నురుగు మూడు రూపములు ధరిస్తున్నాది. అదియే ప్రత్యక్షము, పరోక్షము, అనుమానము. ప్రత్యక్ష పరోక్ష అనుమానములు మూడింటికి మూలస్థానము ఒకటే! అదే అద్వైతము. ద్వైతత్వమునకు త్రిపుటి అన్నారు. మూడుకూడిన ఏకత్వమే ఆత్మతత్త్వము.

**మానవత్వమునకు మూలాధారము ఆత్మయే!**

చిత్, అచిత్, ఈశ్వరత్వము మూడింటిభాగమే. చిత్ అనగా జడము, అచిత్ అనగా భౌతికము, ఈశ్వరత్వమనగా త్రికాలాభాద్యము. ఈ మూడింటియొక్క ఏకత్వమే జీవితముయొక్క అంతరార్థము. ఒకటి దేహము, రెండవది మనస్సు, మూడవది ఆత్మ. దేహము మనస్సును ఆధారము చేసుకుంది. మనస్సు ఆత్మను ఆధారము చేసుకొనిఉన్నది. అన్నింటికి ఆత్మయే ఆధారము. మానవత్వమునకు మూలాధారము ఆత్మయే. అదియే అద్వైతము అని బోధిస్తూ వచ్చారు. ఈ సత్యమును గుర్తించుకోలేని వ్యక్తులు భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన విషయములలో ప్రవేశించి అనేక విధములైన శ్రమలకోర్చి కట్టకడపటికి ఆత్మతత్త్వము realise చేస్తున్నారు. శుద్ధోదనునకు లేక లేక ఒక కుమారుడు పుట్టాడు. అతనిపేరు సిద్ధార్థ. ఈ కుమారునకు ప్రాకృత జగత్తునందు ఏ కష్టము, బాధ, దుః



sri sathyasai vahini vacharamrutam

ఖము కలిగించకుండా చూచుకోవాలని యిల్లు వదలి బయటకు పంపటంలేదు. ఒకానొక సమయంలో శుద్ధోదనుడు ఒక మహర్షి తన ఆస్థానమునకు రాగానే పిల్లవానిని చూపించాడు. ఆ మహనీయుని వాక్కు అమృత వాక్కు. 'శుద్ధోదనా! ఈ పిల్లవాడు తీవ్రవిరాగిగా మారిపోతాడు. ఇంతేకాదు యావత్ ప్రజలకు దివ్య సందేశమునందించే మహా విరాగిగా మారిపోతాడు'. ఈ మాట విన్న తక్షణమే శుద్ధోదనుడు చాలా భయపడిపోయాడు. తన కుమారుడు బాహ్య ప్రపంచములో ఏమి చూస్తే వైరాగ్యము కలుగుతుందోనని ఎక్కడికి బయటకు పంపటంలేదు. 18 సం॥లో వివాహము చేశాడు. వివాహము చేయటమేకాక యువరాజుగా పట్టము కట్టాడు. యువరాజు అయిన తరువాత సిద్ధార్థుడు 'నా రాజ్యము నేను చూడాలి. రాజు కేవలం అంతః పురములో కూర్చోటంకాదు, రాజ్యమునంతా పరిశీలన చేయాలి. కనుక నేను రాజ్యము చూడటానికి బయటకు వెడతాన'న్నాడు తండ్రితో. తండ్రి భయపడుతూనే ఉన్నాడు. కానీ, వివాహము చేసుకున్నాడు కనుక ఎక్కడికి పోడు అనే మూఢనమ్మకము. ఒకనాడు సిద్ధార్థుడు రథముపై కూర్చొని కొంత దూరము వెళ్లాడు. దారిలో ఒక వృద్ధురాలు కఱ్ఱను చేతబట్టుకొని వంగి వంగి నడుస్తూ వస్తోంది. చూచాడు. రథసారథిని అడిగాడు: 'ఏమిటి? ఈ మృగము చాలా వింతగా కనిపిస్తున్నాది' అన్నాడు. 'కాదు ప్రభూ! ఈమె మనిషి-వయస్సు మీరేటప్పటికి ఈ విధంగా వంగిపోతుంది' అన్నాడు. సిద్ధార్థుడు తిరిగి 'అందరు వయస్సు అయితే యీ స్థితికి వస్తారా?' అని ప్రశ్నించాడు. 'రాక తప్పదు. సృష్టియొక్క నైజము' అని చెప్పాడు సారథి. యింకా కొంతదూరము పోయాడు. ఒక క్షయవ్యాధి రోగి చెట్టుక్రింద కూర్చుని దగ్గుతూ దగ్గుతూ ఆయాసముతో 'అబ్బా!' అని అరుస్తున్నాడు. 'ఏమిటి? ఎందుకీ అవస్థ పడుతున్నాడ'ని ప్రశ్నించాడు, రాకుమారుడు. 'శరీరమునకు అనేక రకములైన వ్యాధులుంటున్నాయి. అసలు మానవశరీరమే ఒక రోగముల గంప. ఎప్పుడు ఎవరికి ఏ వ్యాధి వస్తుందో ఎవరికి రాకుండా పోతుందో చెప్పటానికి వీలుకాదు' అని బోధపరిచాడు, రథసారథి. సిద్ధార్థుని మనస్సులో చాలా మార్పు కలిగింది. ఇంకా కొంచెం దూరం పోయాడు. ఒక శవమును నలుగురు మోసుకొని శ్మశానమునకు తీసుకొని పోతున్నారు. 'సారథీ ఏమిటిది? మోసుకొని పోతున్నారు' అని ప్రశ్నించాడు, సిద్ధార్థుడు. 'శవము ప్రభూ', అన్నాడు. 'శవము అంటే ఏమిటి?' అని ప్రశ్నించాడు. 'ప్రాణము లేనిదే శవము. మనం శివం. శివమనగా ప్రాణముంటున్నది. అ

sri sathyasai vachanamrutam

ప్రాణములేనిదే శవము' అని చెప్పాడు. 'ప్రాణము అందరికి పోతుందా?' అని మరొక ప్రశ్న. 'తప్పునది కాదు. ఎప్పుడో ఒక పర్యాయము ఆ ప్రాణము పోతుంది' అని జవాబు. విన్నాడు. ఇక తన ప్రయాణాన్ని ముందుకు సాగించలేదు. రద్దు చేసుకున్నాడు. యింటికి వచ్చాడు. భోజనం చేయలేదు. రాత్రి పండుకున్నాడు. నిద్రరాలేదు. భార్య యశోధర, కుమారుడు రాహులుడు పండుకున్నారు. వారివైపు ఒకసారి తీక్ష్ణ దృష్టితో చూచాడు. 'సర్వం దుఃఖమ్ దుఃఖమ్ దుఃఖమ్', 'సర్వం భయమ్ భయమ్ భయమ్', 'సర్వం అనిత్యం అనిత్యం అనిత్యం', 'సర్వం శూన్యం శూన్యం శూన్యం' అని యిల్లు వదలి వెళ్లాడు, తీవ్ర వైరాగ్యముతో. మనము ఎందరో రోగులను చూస్తున్నాము, ఎందరో వృద్ధులను చూస్తున్నాము, ఎన్నియో శవములను చూస్తున్నాము. కానీ అందరికి యీ వైరాగ్యము కలగుతుందా? లేదు. ఒక్క సిద్ధార్థునికి మాత్రమే కలిగింది.

**భగవదనుగ్రహముచేతనే తీవ్రవైరాగ్యము కలుగుతుంది**

అట్టి తీవ్రవైరాగ్యము సాధించేశక్తి రావాలంటే ఒక్క భగవదనుగ్రహమే కావాలి. అదే విధముగా ఒక రాజకుమారుడు అరణ్యమునకు విహారయాత్ర వెళ్లాడు. చాలా తిరిగి తిరిగి అలసిపోయాడు. అలసిపోయి ఒక ఆశ్రమములో ప్రవేశించాడు, నీటికోసం. ఆ ఆశ్రమములో నివసిస్తున్న స్వాములవారు 'ఎవరండి మీరు'? అని ప్రశ్నించాడు. 'నా పేరు జితేంద్రియుడు' అని చెప్పాడు. 'మీరు ఎక్కడనుంచి వచ్చారు' అని ప్రశ్నించిన మునికి 'జితేంద్రియరాజ్యమునుంచి వచ్చాను. నాకు త్రాగటానికి నీరు కావాలి' అని చెప్పాడు. నీరు యిచ్చాడు. కూర్చోబెట్టాడు. ఈ వ్యక్తి పేరుకు తగిన ప్రవర్తన ఉంటున్నాదా, అని విచారించాడు. ఉదాహరణకు పేరు ధర్మజ అని పెట్టుకుంటాడు; వాడు అంతా అధర్మమే! అదే విధముగా త్యాగరాజు అని పేరుగలవాడు పేరుకు తగినట్టు ప్రవర్తించలేకపోవచ్చు. 'ఇతడు జితేంద్రియుడని పేరు పెట్టుకున్నాడు. అందుకు తగిన రీతిగా ఆచరణలో చూపగలడా? రాజ్యము పేరుకూడా జితేంద్రియ రాజ్యమంటున్నాడు చూద్దాం' అనుకుని. రాజకుమారుని వస్త్రములు తీసుకొని సన్యాసి వస్త్రములను అతనికిచ్చి 'బాబా! రెండు దినములు యిక్కడ వుండు. నేనుపోయి వస్తాన'ని జితేంద్రియ రాజ్యమునకు పోయాడు. అక్కడ సిపాయిలున్నారు. ఈ సన్యాసి వచ్చాడని వారు నమస్కారము అన్నారు. 'నాయనా!

sri sathyasai vahini amrutam

ఒక వార్తను తెలిపే నిమిత్తము నేను యిక్కడకు వచ్చాను. ఈ వాక్యము రాజుగారికి తెలియజేయండి' అన్నాడు. 'యువరాజు మృగములచేత చిక్కి మరణించాడు. అతని దుస్తులు తీసుకువచ్చాన'ని చూపించాడు. అక్కడ సిపాయిలు చెప్పారు: 'గుడ్డలు ఎందుకు తెచ్చావు? పుట్టిన ప్రతివ్యక్తి మరణించక తప్పదు. జననమునకు ప్రక్కనే మరణము వుంటుంది. రెండు ఒకే పర్యాయము వస్తున్నాయి కానీ ప్రత్యేకంగా పుట్టి రావటంలేదు. జననంతోనే మరణము చేరి వస్తున్నాది' అని వ్యాఖ్యానించారు. ఈనాటి కాలంలో రైల్వే వేగన్లు ఉంటాయి. ఈ వేగన్లు కోచ్ ఫ్యాక్టరినుండి అవసరమైన చోటుకు పంపిస్తుంటారు. దానిపై 'రిటర్న్' అని ఒక తేది వేసి పంపిస్తారు. ఈ వేగను ఫలాన తేదిలోపల రిటర్న్ పంపించండి అని దాని అర్థము. మన దేహమనే వేగనుకుకూడా రిటర్న్ తేదీ ఉంటున్నది. కానీ పైకి కనిపించటంలేదు, ఆ తేది. ఈ మాదిరి ఏ వ్యక్తి అయినా చావకతప్పదని సిపాయిలు చెప్పేటప్పటికి వీరు యువరాజుపై ద్వేషముగా ఉన్నారేమోనని భావించుకొని రాజు దగ్గరకు వెళ్లాడు, సన్యాసి. 'రాజా! నీ కుమారుడు మరణించాడు' అని ఏడిచాడు. సన్యాసి ఏడుస్తే రాజు ఫక్కున నవ్వుతున్నాడు. 'ధరించినది కాషాయవస్త్రము. కానీ, నీ మాటలు కషాయంగా ఉంటున్నాయి. ఇందులో ఏడ్చుటకు కారణం ఏమిటున్నాది? ఇది ఏడ్వవలసినది కాదే. విచారించవలసినది కాదు. ఒక చెట్టుపై సాయంకాలం అనేక పక్షులు వచ్చి వాలిపోతుంటాయి. తెల్లవారి అయ్యేటప్పటికి పక్షులు వాటి మాటికి అవి ఎగిరిపోతుంటాయి. ఒక్క చెట్టుపై కూర్చున్న పక్షులకు ఏ సంబంధబాంధవ్యము ఉంటున్నది? నా కుటుంబము అనే చెట్టుపైన భార్య, బిడ్డలు అన్నీ వాలినాయి కొడుకులు, కోడళ్లు, అందరు ఈ పక్షులలాంటివారే! ఎక్కడ ఎప్పుడు ఏ పక్షి ఎగిరిపోతుందో! దీనికి విచారించనవసరంలేదు. ఇది సహజం' అని నిరాసక్తంగా చెప్పాడు, రాజు. అబ్బా! ఎంత కఠినుడు ఈ రాజు! అనుకున్నాడు సన్యాసి. తిరిగి రాణిగారికి ఆ వార్త చెప్పటానికి వెళ్లాడు. 'తల్లి ఏ విధంగానైనా దుఃఖపడుతుంది. తప్పినది కాదు' అనుకున్నాడు మనస్సులో. 'అమ్మా! నీ కుమారుడు మరణించాడు. దుస్తులు యివిగో' అన్నాడు. ఆమెకూడా ఫక్కున నవ్వింది. 'సన్యాసీ! మీరు సర్వసంగపరిత్యాగులుకదా! మీకుకూడా ఈ అభిమానమెందుకు? ఆత్మపురికి అనేకమంది ప్రయాణము చేస్తుంటారు. మధ్య మధ్య సత్రములలో కొంతమంది

sri satyasai vahamrutam

ఆగుతుంటారు. ఆ రాత్రికి ఆగుతారు, తెల్లవారి లేస్తూనే ఎవరిపాటికి వారు వెళ్లిపోతారు. జీవితము ఒక సత్రము వంటిది. ఈ సత్రములో అందరు చేరారు. ఈ దేహము ఎప్పుడు వదలుతుందో ఎవరికి తెలుసు? చెప్పటానికి వీలుకాదు. కాబట్టి దీనికి దుఃఖించి లాభములేదు'. 'భార్య ఉంటున్నాదికదా తప్పక ఆమె ఏడుస్తుంది', అనుకున్నాడు. 'తల్లీ! నీయొక్క పతి మరణించాడు' అని చెప్పాడు. అప్పుడు ఆమె చెప్పింది, 'వర్షములో గాలికి చెట్టుకొమ్మలు విరిగి రాలిపోతుంటాయి. ప్రవాహము వస్తుంది. ఎక్కడో ఒక అడవినుండి కొట్టుకొని వచ్చిన ఒక కఱ్ఱ మరొక అడవినుండి వచ్చిన ఒక కఱ్ఱ రెండు ప్రవాహములో వచ్చి కలుసుకుంటాయి. మధ్య మధ్య కలుస్తుంటాయి విడిపోతుంటాయి. సంసారమనే సాగరములో నేను ఒక కఱ్ఱ, ఆయన ఒక కఱ్ఱ. ఈ రెండు కఱ్ఱలు చేరినాయి. విడిపోయినాయి. ఏమీ ఆశ్చర్యం కాదే!' అనింది ఆమె. పైగా 'దీనికి అంతా అజ్ఞానమమకారములే మూలకారణములు. అంతేగాని అవస్థలు ఏమాత్రము భేదముకాదు. అవస్థలు సహజమే! మనము విచారించనవసరములేదు' అని నిష్కర్షగా చెప్పింది. ఇలా ఆ సన్యాసి అందరిని పరీక్ష చేశాడు. 'యిది నిజముగా జితేంద్రియ రాజ్యమే!' అనుకుని తిరిగి రాజకుమారుని పరీక్ష చేయాలికదా! అక్కడకు వెళ్లాడు. 'రాజకుమారా! పరరాజులు వచ్చి నీ రాజ్యముపైబడి రాజ్యమును స్వాధీనము చేసుకొని అమ్మనాన్నలను చెరసాలలో పెట్టారు. చాలా అవస్థలపాలవుతున్నారు. తక్షణమే వెళ్లు వారిని విడిపించు. యుద్ధము చేయి' అన్నాడు. అప్పుడు రాజకుమారుడు చెబుతున్నాడు: 'అంతా దైవ సంకల్పమే! ఆ రాజ్యము నేను పుట్టే సమయములో తెచ్చుకోలేదు. నేను పోయే సమయములో తీసుకుపోతానా? ఇంత మాత్రానికి నేను పోయి యుద్ధము చేసి జయించవలెనా. నా రాజ్యము కాదు. నా రాజ్యము ఆత్మ సామ్రాజ్యమే! ఆత్మ సామ్రాజ్యము నిమిత్తమై నేను పోరాడుతున్నాను. అదే kingdom of heaven. అది నాకు లభ్యము కావాలి. అది పోరాడితే లభ్యమయ్యేదికాదు. ప్రేమతో దానిని సాధించాలి. ఈ రాజ్యము నాకు అక్కరలేద'న్నాడు. అప్పుడు ఆ సన్యాసి ఈ రాజకుమారునకు సాష్టాంగనమస్కారము చేశాడు. 'మేము సన్యాసులుగా వేషాలు వేస్తున్నాము. వేషమునకు తగిన ప్రవర్తనలు మాలో లేవు. ఎంతమంది సంసారులో నిజమైన వైరాగ్యముతో జీవితమును గడుపుతున్నారు'. అని నిర్ణయము చేసుకున్నాడు. ఈ

srisathyasaivachanamrutam

విషయాన్నే ధృవపరుస్తూ శంకరులవారు ఒక చక్కని ఉదాహరణ చెబుతున్నారు:

**రూప, నామములకు తగిన ప్రవర్తన అవసరము**

ఒక నటకుడు సన్యాసి వేషము వేసుకొని ఒక రాజసభలో ప్రవేశించాడు.

> **మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః**
> **అర్థం నాస్తి, గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత.**
> **జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునఃపునః**
> **సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత.**

అని ప్రవేశించాడు. రాజుగారు లేచి వచ్చి ఉచిత ఆసనము యిచ్చాడు. కూర్చున్నాడు. ఆత్మతత్త్వమును, ఏకత్వమును, అద్వైతమును చక్కగా బోధించాడు, ఒక గంటసేపు. సభ పూర్తి అయిన తరువాత రాజాజ్ఞను పురస్కరించుకొని మంత్రి తట్టలో కొన్ని బంగారు కాసులు తీసుకువచ్చాడు. 'మీవి పవిత్రమైన వాక్కులు. పవిత్రమైన మీ మాటలు వినగలిగాము. అందుకు బహుమతిగా వీటిని యిస్తున్నాను' అన్నాడు. అప్పుడు సన్యాసి 'ఛీ! నాకు అక్కరలేదు. నేను వేసిన వేషము ఏమిటి? కాషాయము. అంటే నేను సన్యాసిని. సర్వసంగపరిత్యాగమే సన్యాసి లక్షణము. మీ బహుమానము నిమిత్తమై నేను రాలేదు. మీ బహుమానము నాకు అవమానము. నాకు అక్కరలేదు' అని చెప్పి వెళ్లాడు. రెండవదినము ఆ నటకుడే ఒక నర్తకి వేషము వేసుకువచ్చాడు. స్త్రీవలె అలంకారము చేసుకున్నాడు. వచ్చాడు, నృత్యము చేశాడు ఆ సభలోపల. సభలోని వారందరు తన్మయులై పోయారు. భూమికి తగిలిన కాలు, తాళం విడిచిన చేయి, యీ విధంగా కాలుభూమిపైననే నిలువలేదు. చూస్తూ చూస్తూ ఉండిన రాజు అట్లనే స్తంభించిపోయాడు. మంత్రి చాలా తెలివికలవాడు. ఆనాడు మంత్రి జాగ్రత్తపడ్డాడు. అందుకోసమే మంత్రులను పెట్టుకుంటారు. రాజుకు దాని విలువ తెలియకపోయినా, ఆయన తలపైన వజ్రవైఢూర్య గోమేధిక మరకత మాణిక్యములతో పొదిగిన ఒక బంగారు కిరీటము ఉంటుంది. కానీ తలలోపల రాళ్లుంటాయి. వారికి సలహాలు యిచ్చేకోసమే మంత్రులుంటారు. రాజులకు అనుభవము ఉండదు. అందువల్ల మంత్రి చక్కగా గుర్తించాడు. గుర్తించి నిన్నటిదినము సన్యాషి వేషము

sri sathyasai vachanamrutam

వేసుకున్న నటుడే యితడు అనుకున్నాడు. రాజుగారి ఆజ్ఞప్రకారము తిరిగి బంగారు కాసులు తీసుకువచ్చి బహుమానంగా యిచ్చాడు. అప్పుడా వేషగాడు 'రాజా! నానర్తనకు యింత మాత్రమేనా బహుమానము? నా కింకా ఎక్కువ కావాలి' అన్నాడు. మంత్రి చెప్పాడు: 'నిన్నటిదినము సన్యాషివేషముతో వచ్చావు. నాకు ఏమీ అక్కరలేదు అన్నావు. ఈనాడు నాకు యింకా ఎక్కువ కావాలి అంటున్నావు. ఏమిటి దీని అంతరార్థము?' అప్పుడు చెప్పాడు, 'వేషమునకు తగిన ప్రవర్తన అవసరము. నామమునకు తగిన నడతలు అవసరము. నేను ఈనాడు నర్తకిని. నా నటనకు తగిన ప్రతిఫలము ముట్టాలనే ఆశ నాకు ఉంది. నిన్నటి రోజున నేను సన్యాసి వేషము వేసుకుని వచ్చాను. దానికి తగిన త్యాగము, వైరాగ్యము ఉండవలసినదే! కాని నేడు నేను నర్తకిని. కాలమునకు తగిన ప్రవర్తన, నామమునకు తగిన వర్తన ఈ రెండు చేరినదే నర్తన' అని తెలియజెప్పాడు.

**మానవులుగా పుట్టినందుకు మానవతావిలువలు ప్రదర్శించాలి**

మీరు మానవులుగా పుట్టారు. మానవునకు తగినట్టుగా నటించాలి. మానవత్వముతో నీవు జీవించాలి. యిది శంకరులు బోధించినది. ఏవేషమునకు ఆ నడత చాలా అవసరము. ఏ రూపమునకు ఆ ప్రవర్తన అత్యవసరము. ఓ మానవులారా! మీరు మానవాకారము ధరించినారు. మానవతా విలువలు మీరు ప్రదర్శించాలి. మానవతా విలువలు పెంచుకోవాలి. లేకపోతే ప్రయోజనము ఏమిటి? మానవత్వమునకు చాలా అవమానకరంగా ఉంటుంది. అదే the proper study of mankind is man అని. ఏమిటి ఈ mankind? ఏమిటి మానవతా విలువలు? Thoughts, words, action, ఈ మూడింటి ఏకత్వమే మానవత్వమునకు సరైన అర్థము. ఇదే వేదాంతమునందు త్రికరణశుద్ధి అని చెప్పారు. ఈ మూడింటి ఏకత్వముచేత ప్రేమ ఆవిర్భవిస్తుంది. ఈ ప్రేమ మనలో ఆవిర్భవించెనా హృదయకమలము వికసిస్తుంది. ఈ హృదయకమలము వికసించగానే సర్వసంగపరిత్యాగివి అవుతావు. కనుక, వైరాగ్యము రానివారికి హృదయకమలము వికసించలేదు. హృదయకమలము వికసించకుండా ఉండటానికి కారణం, ప్రేమతత్త్వము అందులో అభివృద్ధి కాకపోవటమే! ప్రేమ లేకపోవటంచేత మృగముగా జీవిస్తున్నాడు.

srisathyasaivachanamrutam

అడవిలో సంచరించే క్రూరమృగములకు ప్రేమ ఉండదు. అదే చిన్న పిల్లవాడైన ప్రహ్లాదుడు తండ్రికి చెబుతున్నాడు. 'తండ్రీ! మీరు ఎన్నో విద్యలు నేర్చినారు. ఎంతో వేదాంతము చదివారు. శాస్త్రములు చదివారు. కానీ, మీరు మానవులవలె ప్రవర్తించటంలేదు. అడవిలో మృగములకు దయ, దాక్షిణ్యములు ఉంటున్నాయి. కన్నకొడుకే, కట్టుకున్న భార్యే అనే అభిమానములేకుండా వారిని హింసిస్తున్నావు. నీకంటె అడవి మృగములు చాలా మేలు' అన్నాడు. యితరులను బాధించి తాను బాధపడేవాడు మృగముతో సమానమే! కనుకనే be good. నీవు మొట్టమొదట మంచిగా ఉంటుండు. Do good. ఈ రెండింటి తత్వముచేత నీ జీవితము good అయిపోతుంది. జీవితము మంచిది కావాలనుకుంటే మంచి గుణములు ప్రారంభించాలి. ఈ విధంగా శంకరులవారు అనేక ప్రాంతములకు బయలుదేరి వెళ్లి అనేక విధములుగా అద్వైతమును బోధిస్తూ దుఃఖముతో కూడుకున్న మానవులకు ధైర్యసాహసములను యిచ్చి మానవత్వపు విలువలు చక్కగా ప్రబోధిస్తూ వచ్చారు. తమ గురువు ఈ రకమైన బోధలు చేస్తున్నాడని వెంట ఉండిన శిష్యులుకూడా భజగోవిందములో ఒక్కొక్కరు ఒక్కొక్క శ్లోకము చెబుతూవచ్చారు. వారుకూడా దాంట్లో లీనమైపోయారు. అప్పటి భారతదేశమందు అద్వైతసిద్ధాంతము బాగా స్థిరపడిపోయింది. కానీ, క్రమక్రమేణా తిరిగి ఈ ఆధునికయుగము ప్రారంభముకాగానే అద్వైతమతము చల్లబడుతూవచ్చింది.

### భగవంతునిపై ప్రేమ పెరిగే కొలది వైరాగ్యము ప్రాప్తిస్తుంది

ప్రేమస్వరూపులారా! మీరు సన్యాసము తీసుకోమని నేను చెప్పటంలేదు. లేక వైరాగ్యము పొందమని చెప్పటంలేదు. మీ కర్తవ్యము మీరు నిర్వర్తించుకుంటూ లక్ష్యము భగవంతునిపై పెట్టి అన్నింటికి మూలాధారము ఒకటున్నది అనే సత్యము గుర్తించండి. ఈ సత్యము గుర్తించినప్పుడు ఒక విధమైన వైరాగ్యము ప్రారంభమవుతుంది. అంతే కానీ, వైరాగ్యము బలవంతముతో వచ్చేది కాదు. భగవంతునిపై ప్రేమ పెరిగే కొలది వైరాగ్యము ప్రాప్తిస్తుంది. ఈ detachment easy గా వస్తుంది. మన మనస్సు తిప్పటంలోనే ఉంటున్నాది. ఇది ఒక బీగము key. Put the key, turn left side opens, turn right side, locked. Same lock, same key. turning difference. కాబట్టి lock is bondage. Opening is liberation. కనుక 'మనయేవ

srisathyasaivachanamrutam

మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' మనసే దీనికి మూలకారణము. కాబట్టి మన హృదయమే lock, మన మనస్సే key. దీనిని భగవంతునిపైపు తిప్పుతే detachment. ప్రకృతివైపు తిప్పుతే attachment. ఇది ఎట్లా అని మీకు సందేహము కలగవచ్చును. మీకు రెండు కాళ్లున్నాయి. కానీ పరీక్షలో ప్యాసై MBA తీసుకున్న తరువాత ఉద్యోగములో ప్రవేశించిన తరువాత అమ్మనాన్నలు ఒక అమ్మాయిని కట్టేస్తారు. Parents కట్టవచ్చు. లేకపోతే మీరే కట్టుకోవచ్చు. ఏదైతే నేమి? అప్పుడు నాలుగుకాళ్లు అవుతాయి. నీవి రెండు, ఆమెవి రెండు. మరి తరువాత 6 కాళ్లు అవుతాయి. తరువాత మరి 8 కాళ్లు అవుతాయి. తరువాత 10 అవుతాయి. ఈ కాళ్లు అధికమైనకొలది నడక చల్లారిపోతుంది. అదియే బంధము. ఈ బంధము ఎక్కడనుంచో వచ్చేది కాదు. నీ కోరికలనుంచే వస్తున్నాది. కనుకనే Less luggage, more comfort, make travel a pleasure. జీవితము చాలా దీర్ఘ ప్రయాణము. ఈ దీర్ఘ ప్రయాణములో మనము ఈ లగేజిని కొంచెం తగ్గించుకోవాలి. అప్పుడే ఆనందము పెరుగుతూ వస్తుంది. ప్రాకృతమైన బాధ్యత తగ్గే కొలది ఆనందము పెరుగుతూ పోతుంది. భారము తగ్గిపోయే విషయమును గురించి రేపటిదినము మాట్లాడుకుందాము. మీరు మీ కర్తవ్యములను నిర్వర్తించండి. కానీ మనస్సు లక్ష్యముపై పెట్టుకోండి.

**(తేదీ 10-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam